నమస్తే తెలంగాణ
జగిత్యాల
5 | కరీంనగర్, శుక్రవారం 7 ఫిబ్రవరి 2025 | JAGTIAL

# వాటర్ బెల్!

## జిల్లెల్ల ప్రభుత్వ పాఠశాలలో సరికొత్త ప్రయోగం

- ప్రతి విద్యార్థీ నీరు తాగేలా చర్యలు
- ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో అందుబాటులో తాగునీరు
- పాఠశాలను ప్లాస్టిక్‌రహితంగా మార్చేందుకు పిల్లలకు స్టీల్ వాటర్ బాటిల్స్
- సహకరించిన దాతలు.. పెరుగుతున్న నీటి వినియోగం
- గంట మోగగానే విద్యార్థుల చేతుల్లో వాటర్‌బాటిళ్లు
- వేసవి కాలంలో ప్రతి పాఠశాలలో అమలు చేయాలంటున్న నిపుణులు

*తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల పాఠశాలలో వాటర్‌బెల్‌లో భాగంగా నీరు తాగుతున్న విద్యార్థినులు*



ఎండలు మొదలయ్యాయి. వాతావారణం వేడెక్కుతున్నది. ఈ పరిస్థితుల్లో విద్యార్థులు డిహైడ్రేషన్‌కు గురికాకుండా ఉండేందుకు తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు 'వాటర్ బెల్' పేరిట సరికొత్త కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా రోజుకు రెండు సార్లు పిలలు సరిపడా మంచినీరు తాగేలా చూస్తున్నారు. సరైన మోతాదులో నీటిని తాగడం వల్ల డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఉండడమే కాకుండా, పిల్లలు అనేక రుగ్మతలకు దూరం కానున్నారు. అంతేకాదు, పాఠశాలలను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి విద్యార్థికీ స్టీల్ వాటర్ బాటిల్ ఇచ్చి.. వాటర్‌బెల్ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తున్న తీరు మిగతా పాఠశాలలకు ఆదర్శంగా నిలుస్తున్నది.

కరీంనగర్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఎండాకాలం వచ్చిందంటేచాలు నాలుక తడారిపోతుంది. గుక్కెడు నీరు తాగితే బాగుండు అనిపిస్తుంది. కానీ, ఒక్కోసారి సమయానికి తాగునీరు దొరకదు. ఓసారోసారి కొద్దిపాటి నీళ్లతోనే దాహం తీర్చుకోవాల్సి వస్తుంది. విద్యార్థుల పరిస్థితి మరీ ఇబ్బందిగా ఉంటుంది. ఉదయం పాఠశాలలకు వెళ్లే పిల్లలు చాలా మంది ఇంటి నుంచి మంచినీళ్లు తెచ్చుకోరు. ఒక వేళ తెచ్చుకున్నా.. తాగడానికి సమయం దొరక్కపోవడం, కంటిన్యూగా తరగతులు జరిగినప్పుడు మధ్యలో వెళ్లి తాగలేని పరిస్థితి ఉంటుంది. ఒకవేళ నీరు బాగా తాగితే మళ్లీ వాష్‌రూంకు వెళ్లాల్సి వస్తుందనే భయం కూడా వెంటాడుతుంటుంది. వేసవిలో అయితే చాలా మంది విద్యార్థులు నీళ్లు తాగక వివిధ రకాల రోగాల బారిన పడే ప్రమాదముంటుంది. తద్వారా బడులకు వెళ్లలేని పరిస్థితులు ఏర్పడడం, చదువులకు ఆటంకం కలగడం.. తిరిగి కోలుకోవడానికి విచ్చలవిడిగా మందులను వాడడం వల్ల విద్యార్థులు మానసిక వేదనకు గురవుతున్నట్టు అనేక సర్వేల్లో వెల్లడవుతున్న విషయం తెలిసిందే.

### నీటి వల్ల ఎన్నో లాభాలు

మంచినీరు శరీర ఉష్ణోగ్రతను సమతౌల్యం చేస్తుందన్న విషయం అందరికీ తెలిసిందే. సరైన సమయంలో సరైన మోతాదు మేరకు నీరు తాగకపోతే డిహైడ్రేట్‌కు గురికావడం. తద్వారా శరీర ఉష్ణోగ్రతలు పెరిగి మనిషి సొమ్మసిల్లి పోవడం, అలాగే శరీరంలో ఎలక్ట్రోలైట్స్, ప్లాస్మా పెరిగిపోయి అనారోగ్యం బారిన పడడం జరుగుతుంది. అందుకే ప్రతి మనిషి రోజుకు కనీసం రెండు లీటర్ల నీరు తాగాలని వైద్యులు సూచిస్తున్నారు. శరీరంలో చేరిన విష పదార్థాలు తొలగాలంటే సరైన మోతాదులో మంచినీరు తీసుకోవాలని, మంచినీరు సరిగ్గా తాగిన వ్యక్తికి కీళ్ల నొప్పులు, మలబద్ధకం, అజీర్ణం, రక్తపోటు లాంటి సమస్యలు రాకుండా ఉంటాయని చెబుతున్నారు. సరిపడా మంచినీళ్లు తాగిన వారి శరీరంలో ఆక్సిజన్ సర్కులేషన్ సరిగా ఉండడం వల్ల శక్తి ప్రసరణ జరుగడంతో పాటు ఉత్సాహంగా ఉంటారని, చర్మం కూడా కాంతివంతంగా ఉంటుందని అనేక పరిశోధనల్లో వెల్లడించారు.

### జిల్లెల్లలో 'వాటర్ బెల్' ప్రయోగం

ప్రస్తుతం వేసవి ప్రారంభమైన నేపథ్యంలో తాగునీరు తీసుకోవడం తప్పనిసరి కాగా, జిల్లెల్ల పాఠశాల ఉపాధ్యాయులు ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకున్నారు. హెచ్‌ఎం జోగినపల్లి అనురాధ ఆధ్వర్యంలో 'వాటర్ బెల్' పేరిట సరికొత్త కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా మంచినీటి ఉపయోగాలు పిల్లలకు వివరిస్తూ.. రోజుకు కనీసం రెండు లీటర్ల నీటిని తాగేలా విద్యార్థులకు ఒక అలవాటుగా మార్చుతున్నారు. అందుకోసం ప్రతి రోజూ పాఠశాలలో ఉదయం 10.45 గంటలకు, అలాగే మధ్యాహ్నం 2.45 గంటలకు గంట మోగిస్తున్నారు. ఈ స్వల్ప విరామంలో విద్యార్థినీ విద్యార్థులు ఉపాధ్యాయులు అందరూ కలిసి తప్పనిసరిగా మంచినీరు తాగుతున్నారు. ఇదే సమయంలో ప్లాస్టిక్ రహిత పాఠశాలగా మార్చాలన్న లక్ష్యంలో భాగంగా దాతల సహాయంతో విద్యార్థులందరికీ స్టీల్ బాటిల్స్ సమకూర్చారు. పాఠశాలలోనే ఉన్న వాటర్ ఫిల్టర్ నీటిని నిల్వ చేసుకునేందుకు గాను దాతల సహాయంతో స్టీల్ నల్ల డబ్బాలను అందుబాటులోకి తెచ్చారు. నిర్దిష్ట సమయం ప్రకారం గంట మోగగానే విద్యార్థులు వాటర్ బాటిల్స్ తీసుకొని గ్రౌండ్‌లోకి వచ్చి నీటిని తాగేలా చర్యలు చేపట్టారు. దీనివల్ల మంచి ఫలితాలు ఉంటాయని, వాతావరణ మార్పుల వల్ల వచ్చే ఇబ్బందులకు దూరంగా ఉండొచ్చని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జోగినపల్లి అనురాధ తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు రాజేశ్వరరావు, శారద, రమేశ్, లక్ష్మారెడ్డి, పద్మ, శైలజ ,శిరీష, నీరజ, ప్రణీత్, సంతోష్, పద్మ సహకారంతో ఈ ప్రయోగాన్ని సమర్థవంతగా అమలు చేస్తున్నామని, మంచి ఫలితాలు వస్తున్నాయని చెబుతున్నారు. త్వరలో దాతల సహకారంతో చల్లటి నీటి వసతిని కూడా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.



జిల్లెల్ల పాఠశాలలో వాటర్‌బెల్‌లో భాగంగా నీరు తాగుతున్న విద్యార్థులు

---

### రిజర్వేషన్లపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి..




కులగణన విషయంలో తదుపరి కార్యాచరణను ప్రభుత్వం ప్రకటిస్తుందని అందరూ భావించారు. కానీ, రెండు రోజుల క్రితం కేబినెట్ సబ్ కమిటీ చైర్మన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకరుల సమావేశంలో చెప్పిన విషయాలనే ప్రకటన రూపంలో కౌన్సిల్, అసెంబ్లీలో చెప్పడం ద్వారా ఉపయోగమేమిటో ప్రభుత్వం చెప్పాలి. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం బీసీలకు రిజర్వేషన్లను పెంచిన తర్వాతనే ఎన్నికలు నిర్వహిస్తారా.. లేదా? అన్నది ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. బీసీలను, బీసీ ముస్లింల జనాభాను వేరు చేసి ప్రభుత్వం చెబుతున్నది. ఇది కేవలం జనాభాను తక్కువ చేసి చూపించాలన్న ఉద్దేశంతోనే ఇలా చేస్తున్నారు. ప్రభుత్వం ఒక నిర్దిష్టమైన కార్యాచరణను ప్రకటించాలి. ఇంతవరకు కచ్చితంగా డేటానే లేదని ప్రభుత్వం చెప్పడం సరికాదు. 2011జనాభా లెక్కలు అందుబాటులో ఉన్నాయి. అంతర్జాతీయంగా, దేశీయంగా పదేండ్లలో సగటున 13.5శాతం జనాభా పెరుగుతున్నది. ఆ లెక్కన ఇప్పుడు తెలంగాణ జనాభా 4కోట్ల 18లక్షలు ఉండాలి. ప్రభుత్వం చేపట్టిన సర్వేలో ఎస్సీ, ఎస్టీ, బీసీల జనాభా తగ్గినట్లు, ఓసీల జనాభా పెరిగినట్టు కనిపిస్తున్నది. అన్ని వర్గాల జనాభా తగ్గి కేవలం ఒక వర్గం జనాభా ఎలా పెరుగుతుంది? తమ ఇళ్లకు సర్వే చేయడానికి ఎన్యుమరేటర్లు రాలేదని ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నాయి. కాబట్టి మరోసారి వారి వివరాలను సేకరించడానికి ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుంటుందో చెప్పాలి.

**-కోరుకంటి చందర్, రామగుండం మాజీ ఎమ్మెల్యే**

### 9 శాతం అన్యాయమే



వర్గీకరణలోని లోపాలతో వెనుకబడిన కులాల గ్రూపులోకి అభివృద్ధి చెందిన కులాలు వచ్చాయి. రాష్ట్రంలో 15లక్షలు ఉన్న మాలలకు 5శాతం రిజర్వేషన్లు కల్పించినప్పుడు 32లక్షల జనాభా ఉన్న మాదిగలకు కేవలం 9శాతమే ఇవ్వడం అన్యాయం. న్యాయబద్ధంగా 11శాతం రిజర్వేషన్లు కల్పించాలి. దీనిపై మంత్రి దామోదర రాజనర్సింహ స్పందించాలి. లేదంటే రిజర్వేషన్ల కోసం ఎంత వరకైనా పోరాడుతం **- సంపతి కొంరయ్య, ఓబులాపూర్( ఇల్లంతకుంట రూరల్ )**



# కాంగ్రెస్ నయవంచన!

## రగిలిపోతున్న బీసీలు, దళితులు

- కులగణన నివేదికపై మండిపడుతున్న బీసీ సంఘాల నాయకులు
- రిజర్వేషన్ల పేరిట మోసం చేసిందని ఆగ్రహం
- కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేసే వరకు వదలమని హెచ్చరిక
- రీ సర్వే చేపట్టి కచ్చితమైన లెక్కలు తీయాలని డిమాండ్
- ఎస్సీ వర్గీకరణపై భగ్గుమంటున్న దళిత బహుజనులు

కాంగ్రెస్ నయవంచనపై అట్టుడుకుతున్నది. కులగణన పేరిట ప్రభుత్వం ఆడుతున్న నాటకంపై ఆగ్రహం పెల్లుబికుతున్నది. రిజర్వేషన్ల పేరిట తమను మోసగించారని బీసీలు, వర్గీకరణ పేరిట దగా చేశారని దళితులు నిప్పులు చెరుగుతున్నారు. స్థానిక సంస్థల్లో అధికారికంగా 42 శాతం అమలు చేస్తామని చెప్పి, ప్రస్తుతం మాటమార్చడంపై బీసీ సంఘాల నాయకులు కుతకుతలాడుతున్నారు. కులగణన నివేదిక తప్పులతడకగా రూపొందించారని, ఉద్దేశపూర్వకంగా బీసీ జనాభాను తగ్గించి చూపారని మండిపడుతున్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను విస్మరించి, కేవలం పార్టీ పరంగా వాటా కల్పిస్తామని చెప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని కాంగ్రెస్ మరిచిపోయిందని, రాష్ట్రంలోని బీసీలను వెన్నుపోటు పొడిచిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటు ఎస్సీ వర్గీకరణపై దళితబహుజనులు రగిలిపోతున్నారు. అసెంబ్లీలో ఏకపక్షంగా తీర్మానం చేశారని మాల సంఘాల నాయకులు మండిపడుతుండగా, న్యాయబద్ధంగా తమకు 11 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సి ఉన్నా 9శాతం ఇవ్వడం అన్యాయమని మాదిగ సామాజిక వర్గం నాయకులు భగ్గుమంటున్నారు.

**- కరీంనగర్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ)**

### కుతకుతలాడుతున్న బీసీలు

కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు కామారెడ్డిలో చేసిన బీసీ డిక్లరేషన్‌ను పాతరేస్తున్నది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి, తీరా ఇప్పుడు చేతులెత్తేస్తున్నది. ఆ బంతిని కేంద్రం కోర్టులోకి విసిరి చేతులు దులుపుకొంటున్నది. బీసీ కులగణనపై ఆ పార్టీ చేసిన మోసంపై రెండు మూడు రోజులుగా విపరీతమైన చర్చ జరుగుతున్నది. తమకు జరిగిన అన్యాయాన్ని తలుచుకుంటూ బీసీ సంఘాల నాయకులు కుతకుతలాడుతున్నారు. అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ చెప్పిందేమిటి? అధికారంలోకి వచ్చిన తర్వాత చేస్తున్నదేమిటి? అని చర్చిస్తున్నారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే తమ కులాల లెక్కలు తగ్గించిందని ఆరోపిస్తున్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో 51 శాతం ఉన్న బీసీలు పదేళ్లలో పెరగాలి కానీ, తగ్గడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. పదేళ్ల కిందనే 51 శాతం ఉన్న బీసీలు ఇప్పుడు 46 శాతానికి ఎలా తగ్గుతారని నిలదీస్తున్నారు. అగ్ర కులాల రిజర్వేషన్లు కాపాడేందుకే ఈ తరహా కుట్ర చేసిందని ఆగ్రహిస్తున్నారు. ఇదే సమయంలో రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలను కూడా సీరియస్‌గా తీసుకున్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల చట్టబద్ధత ఇప్పట్లో కాకపోవచ్చని, పార్టీ పరంగా తాము వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం సీట్లు బీసీలకే ఇస్తామని, మిగతా పార్టీలు కూడా ఇవ్వాలని కోరడం పెద్ద మోసమని ధ్వజమెత్తుతున్నారు. కాంగ్రెస్ అంటే ఎంత మోసకారి పార్టీనో ఈ ఒక్క విషయంలోనే తేటతెల్లమైందని మండిపడుతున్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపు విషయంలో ఎక్కడా చిత్త శుద్ధిని ప్రదర్శించడం లేదని, తప్పుడు లెక్కల నివేదికను అసెంబ్లీలో చర్చకు పెట్టి, తీర్మానాన్ని కేంద్రానికి పంపించి చేతులు దులుపుకునే ప్రయత్నం చేసిందని ఆరోపిస్తున్నారు. బీసీ కులగణన నివేదిక తమ ఉనికికి ప్రమాదకరంగా మారిందని, వెంటనే దీనిని రద్దు చేసి రీ సర్వే చేయాలనే డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయం అన్ని కులాలకు ఆమోదయోగ్యమై ఉండాలని స్పష్టం చేస్తున్నారు. అగ్ర కులాల సంఖ్యను ఎక్కువ, తమ కులాల సంఖ్యను తక్కువ చేసి చూపే ప్రయత్నం జరుగుతున్నదని, కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను అణిచివేసే కుట్రకు తెర తీసినట్టు స్పష్టమైందని ఆరోపిస్తున్నారు.

### రగిలిపోతున్న దళితులు

ఎస్సీ వర్గీకరణ విషయంలో కాంగ్రెస్ తమను దగా చేసిందని దళితులు మండిపడుతున్నారు. ఎస్సీ వర్గీకరణను అసెంబ్లీలో ప్రవేశపెట్టడంపై మాల సామాజికవర్గం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తుండగా, రిజర్వేషన్ల విషయంలో తమకు అన్యాయం జరిగిందని మాదిగ, ఉప కులాల నాయకులు గుర్రుగా ఉన్నారు. రాష్ట్రంలో 15 లక్షల జనాభా ఉన్న మాలలకు 5 శాతం రిజర్వేషన్లు కల్పించారని, ఈ లెక్కన 32 లక్షల మంది ఉన్న మాదిగలకు 11 శాతం రిజర్వేషన్లు రావాల్సి ఉన్నా 9శాతానికి తగ్గించారని ఎమ్మార్పీస్ నాయకులు భగ్గుమంటున్నారు. వర్గీకరణలో లోపాలతో వెనుకబడిన కులాల గ్రూప్‌లోకి అభివృద్ధి చెందిన కులాలు వచ్చాయని ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ ఎప్పుడూ మాదిగలకు వ్యతిరేకమేనని విరుచుకుపడుతున్నారు. స్థానిక ఎన్నికలకు కూడా ఎస్సీ వర్గీకరణ పాటించాలని, జనాభా దమాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు.

### పోరాటానికి సిద్ధమవుతాం



ఎస్సీ వర్గీకరణతో మాదిగలకు అన్యాయం జరుగుతుంది. ఎస్సీలలో అభివృద్ధి చెందిన కులాలకే మళ్లీ రిజర్వేషన్లలో ఎక్కువ స్థానం కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తున్నది. మాదిగల ప్రయోజనాలను దెబ్బతీసేందుకు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి కుట్ర చేస్తున్నాడని అనిపిస్తుంది. 15లక్షలు ఉన్న మాలలకు 5శాతం రిజర్వేన్లు కల్పిస్తే.. 32లక్షల జనాభా ఉన్న మాదిగలకు 11శాతం రిజర్వేషన్లు దక్కాలి. కానీ, తమకు దక్కకుండా చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగలకు 11 శాతం రిజర్వేషన్లు కల్పించకుంటే పోరాటానికి సిద్ధమవుతాం.

**- గుండేడి ప్రశాంత్, ఓబులాపూర్ (ఇల్లంతకుంట రూరల్ )**

### ఎస్సీలకు ఒరిగిందేమీ లేదు



ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే అసంబద్ధం. పూర్తిగా తప్పుల మయం. సర్వేతో ఎస్సీలకు ఒరిగిందేమి లేదు. ఎస్సీల్లో 18 శాతంగా ఉన్న మాదిగలకు న్యాయబద్ధంగా 11 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి. కానీ, కొన్ని వర్గాలకు మేలు చేసేందుకు మరికొందరికి అన్యాయం చేస్తున్నది. ఇది సరికాదు. అట్టడుగు వర్గాల్లో ఉన్న ఎస్సీలకు న్యాయం చేయాలి.

**- కాంపెల్ల హన్మాండ్లు, దళిత సంఘం నాయకుడు, దట్నూర్ (గొల్లపల్లి)**

### అబద్ధాలు చెప్పడం అలవాటైంది



శాసనసభను అడ్డం పెట్టుకొని అబద్ధాలు చెప్పడం, మోసం చేయడం కాంగ్రెస్ నాయకులకు అలవాటైంది. ఇప్పటికే శాసన సభలో 1400 అబద్ధాలు చెప్పి ఉంటరు. నిజాయితీగా సర్వే చేయాలంటే ఫస్ట్ ముఖ్యమంత్రి ఇంటి నుంచే సర్వే మొదలు పెట్టాలి. అక్కడి నుంచి మంత్రులు, రాష్ట్ర ఉన్నతాధికారులు, ఆ తర్వాత ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు, ప్రజల వద్దకు వెళ్లాలి. సరైన సర్వే రావాలంటే ఎస్‌కేఎస్ మాదిరిగా ఒకే ఒక్కరోజు ప్రభుత్వ యంత్రాంగం అంతా పనిచేసి ఒక్కరోజే చేయాలి. కానీ ప్రభుత్వం ఈ సర్వేను అలా చేయలేదు. అంతా ఆగమాగం చేశారు. ఇలాంటి సర్వేలు ప్రజలను మోసం చేయడానికే పనిచేస్తాయి తప్ప. చట్టబద్ధత కల్పించడానికి పనిచేయవు. ఇప్పటికే అందులో 6శాతం తగ్గించారు. బీసీలకు చట్టబద్ధతతోనే న్యాయం జరుగుతుంది. అందులో కూడా కేంద్ర ప్రభుత్వాన్ని 42శాతం ఇవ్వాలని ఎక్కడ డిమాండ్ చేయలేదు. కేంద్రానికి పంపిన తీర్మానంలో కూడా ఎలాంటి క్లారిటీ లేదు. దీనిని బీసీ వర్గాల ప్రజలంతా ఖండిస్తున్నారు. ఇప్పటికైనా నిజాయితీని నిరూపించుకోవాలంటే సమగ్రమైన సర్వే చేసి చట్టబద్ధత కల్పించి సుప్రీంకోర్టును, కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి బీసీలకు న్యాయం చేయాలి.

**-గంట రాములు, మాజీ జడ్పీటీసీ (ఓదెల) పెద్దపల్లి జిల్లా**

### మరోసారి మోసం చేసే కుట్రే..



ప్రపంచంలోనైనా, భారత దేశంలోనైనా ప్రతి పదేండ్లకు ఒక సారి జనాభా లెక్కలు తీస్తున్నరు. ఎక్కడైనా జనాభా శాతం పెరుగుతూనే కనిపించింది. కానీ తెలంగాణలో మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కుల గణనలో మాత్రం బీసీల జనాభా, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల జనాభా మాత్రమే తగ్గుతుంది. ఒక్క ఓసీలది మాత్రమే పెరుగుతుంది. ఈ విధంగా కుల గణన చేయడం ఎంత వరకు కరెక్టు. ఇంత ఘోరంగా ఏ సర్వేనైనా ఉంటుందా? అనుమానాలు ఉన్నప్పుడు ప్రభుత్వం జవాబు చెప్పాల్సిన అవసరం ఉంది. అలాగే బీసీలది 46శాతం జనాభా అంటూనే లోకల్ బాడీస్‌లో 42శాతం రిజర్వేషన్ ఇస్తామని అన్నారు. 46శాతం జనాభాకు 42శాతం ఇవ్వడం తక్కువ చేసి ఇవ్వడం కాదా..? ఓబీసీలకు 46శాతం కాదు 56.3శాతం జనాభా ఉంది. దానికి తగ్గట్టుగా 56.3శాతం రిజర్వేషన్ అమలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. ఓబీసీలకు విద్య, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల్లో ఓబీసీల్లో జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు కల్పిస్తామన్నారు. దాని గురించి మాత్రం చెప్పడం లేదు. అసలు ఈ సర్వే చేసి ఏం సాధించారు. అసెంబ్లీలో తీర్మానం చేసి ఏం లాభం. ఇదంతా ప్రజలకు మాయ మాటలు చెప్పడానికి చేసిన సర్వేనే. బీసీలను కాంగ్రెస్ మరో మారు మోసం చేసే కుట్రే ఇది.

**- దాసరి ఉష, బీఆర్ఎస్ నాయకురాలు (పెద్దపల్లి)**

### రీ సర్వే తర్వాతనే ఎన్నికలకు వెళ్లాలి



కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బీసీ కుల గణన నివేదికను అసెంబ్లీలో ప్రవేశ పెట్టింది. ఇదంతా తప్పుల తడక అని బీసీ సంఘాలు, మేధావులు ఎంత మొత్తుకున్నా వినిపించుకోవడం లేదు. 1931 జనాభా లెక్కల ప్రకారంగానే దేశంలో బీసీల సంఖ్య 52 శాతం ఉంది. ఇప్పటికి 70 శాతం ఉంటుందని ఒక నివేదిక వెల్లడిస్తున్నది. కానీ, రాష్ట్రంలో మాత్రం 46 శాతంగా చూపడం ఏమిటీ? ఇది కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రగానే మేం భావిస్తున్నాం. కేవలం ఎన్నికల తంతు కోసమే ఈ తప్పుడు నివేదికను ఆగమేఘాల మీద అసెంబ్లీలో ప్రవేశ పెట్టి బీసీల ఓట్లు దండుకోవాలని చూస్తున్నది. కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన మాటపై కాంగ్రెస్ నిలబడడం లేదు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని నమ్మబలికి ఇప్పుడు పార్టీ పరంగా ఇస్తామని చెప్పడం దేనికి సంకేతం? బీసీలకు ఇచ్చిన మాట ప్రకారం మాకు 42 శాతం చట్టబద్ధమైన రిజర్వేషన్లు దక్కాలి. లేదంటే కాంగ్రెస్‌ను రాష్ట్రంలో కూకటి వేళ్లతో సహా పెకిలించే వరకు విశ్రమించం.

**- బొల్లం లింగమూర్తి, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్**

---



.. ఇక్కడ బోర్ వద్ద ఉన్న వ్యక్తి పేరు భూక్యా మోహన్. ఎల్లారెడ్డిపేట మండలం దేవునిగుట్ట తండా. గతంలో గల్ఫ్ దేశాలకు వెళ్లి వచ్చిన ఆయన అదే తండాలో నాలుగెకరాల భూమి కొన్నాడు. అప్పటి నుంచి అందులో కుటుంబ సభ్యులు వ్యవసాయం చేయగా, అతను గల్ఫ్ దేశాలకు వెళ్లి వస్తూ ఉండేవాడు. గతంలో బోర్లు వేయగా వచ్చిన కొద్దిపాటి నీటితో పంటలు సాగు చేసేది. ఈ భూమి మైసమ్మ చెరువు దిగువ భాగంలో ఉండడం.. గత ప్రభుత్వ హయాంలో చెరువు నింపండంతో బోరుబావుల్లోకి నీళ్లు ఉబికి వచ్చాయి. 24 గంటల కరెంటు ఉండడంతో నాలుగెకరాల్లో గతేడాది వరకు పుష్కలమైన పంటలు పండిస్తూ సంతోషంగా గడిపాడు. కానీ, కొన్ని రోజులుగా చెరువులో నీళ్లు లేకపోవడంతో బోర్లు ఎండిపోయాయి. దీంతో తన ఇంటి ముందున్న పంట ఎండిపోతుంటే తట్టుకోలేకపోయాడు. ఎలాగైనా పంటను కాపాడుకునేందుకు బోరు వేయాలనుకున్నాడు. పొలం మధ్యలో పాయింట్ చూసి, బోర్‌వెల్ వెళ్లేందుకు పంట చెడగొట్టి 650 ఫీట్ల మేర బోరు వేశాడు. అయినా, ఫలితం దక్కలేదు. దీంతో మరో చోట 700 ఫీట్లు వేసినా నీళ్లు పడలేదు. సుమారు ₹2 లక్షలు ఖర్చు పెట్టినప్పటికీ చుక్కనీరు పడక పోవడంతో ఏం చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో పడిపోయాడు.

# పొలం చూస్తే దుఃఖిమే

- ఎల్లారెడ్డిపేట మండలంలో ఎండుతున్న పంటలు
- ప్రశ్నార్థకంగా మల్కపేట కాలువ పరీవాహకం
- ఒక్క వందెకరాల్లో ఎండిన పంటలు
- బోర్లు వేసినా దక్కని ఫలితం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 6 : ఎల్లారెడ్డిపేట మండలంలోని అల్మాస్‌పూర్, రాజన్నపేట, కిష్టూనాయక్‌తండా, గొల్లపల్లి, దేవునిగుట్టతండా, బాకుర్‌పల్లి తండాల్లో సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయి. గత ఏడేండ్ల కాలంలో ఈ గ్రామాల్లోని ప్రతి చెరువు నిండుకుండలా మారి బోరుబావుల్లో పుష్కలమైన నీరు ఉండేది. 24 గంటల కరెంటు వచ్చేది. మల్కపేట రిజర్వాయర్ కాలువలో పారే నీరు ఎక్కువై కట్టలు, మత్తడి తెంపిన రోజులు ఉండేవి. ఇప్పుడు అవన్నీ పోయి.. కరెంటు, పంట నీళ్ల కోసం నిద్రలేని రాత్రులు గడుపుతున్న గడ్డుకాలం అనుభవిస్తున్నామని ఆయా గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వద్దకు వెళ్లి మల్కపేట రిజర్వాయర్ నుంచి కాలువలకు నీళ్లు విడిచి రాజన్నపేటలోని కొచ్చెరువు, తిమ్మాపూర్‌లోని మైషమ్మ చెరువు నింపాలని వినతిపత్రం అందించామని, అయినా నీళ్లు రావడం లేదని తెలిపారు. అల్మాస్‌పూర్ నుంచి మొదలు బాకుర్‌పల్లి వరకు సుమారు 8 కిలోమీటర్ల నిడివిలో కాల్వ పరిసరాలను ఆనుకుని సుమారు 800 ఎకరాలు సాగవుతుండగా, నీరు రాకపోవడంతో ఆ పంటల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. కొచ్చెరువు, మైసమ్మ చెరువుల్లో నీళ్లు తగ్గి బోరుబావులు ఇంకిపోయాయి. ఇప్పటికే సుమారు70 ఎకరాల వరకు పంటలు ఎండిపోగా మరో పది రోజులు మిగతా పంటలు కూడా ఎండిపోయే ప్రమాదం ఉండడంతో ఆయా గ్రామాల రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.



### ఇంత గోస ఎప్పుడూ పడలేదు

ఇన్నేండ్లల్ల ఇంత గోస ఎప్పుడూ పడలేదు. చెరువులకు నీళ్లు ఇడిస్తే ఉన్న పంటలన్న బతుకుతయ్. నాకు కాల్వ పక్కన రెండెకరాలుంది. వరి పంటేసిన. బోరు ఎండిపోయింది. నీళ్లు లేక పంట ఇడిసిపెట్టే పరిస్థితి వచ్చింది. పెట్టిన పెట్టుబడంతా ఆగమయింది. సేను జూసినప్పుడల్లా దుఖమస్తంది. ఎవ్వలకు జెప్పినా పట్టించుకుంటలేరు. ఎట్లనన్న జేసి మా పంటలకు నీళ్లు వచ్చేటట్టుజెయ్యుర్రి.

**- గుగులోత్ భీంసింగ్, రైతు, దేవునిగుట్ట తండా**

### కేసీఆర్ సార్ ఉన్నప్పడే మంచిగుండె



మల్కపేట కాల్వ పక్కపొంటి మాకు నాలుగెకరాలుంది. ఏడేండ్ల సంది ఏ కరువూ లేదు. మా మైసమ్మ సెర్ల నీల్లుంటే బోర్లళ్ల నీళ్లుండేటియి. అది ఈ సారి ఎండిపోయింది. మా తండా వాళ్లు సెర్లకు నీళ్లు ఇడువాలని పోయిర్రట. కానీ, ఇంకా నీళ్లు ఇడువలేదు. పోయినేడాది పంటమీద ₹70 వేలు వచ్చినయ్. ఆ పైసలతోటి 400 ఫీట్ల లోతు బోరేయించిన. బొట్టు నీళ్లు పడలేదు. కూరగాయల మందం కూడా నీళ్లు వస్తలెవ్వు. కేసీఆర్ సార్ ఉన్నప్పుడే మంచిగుండె. ఇప్పుడు పంటలకు నీళ్లు లెవ్వు. తాగుదామంటె కూడా వస్తలెవ్వు.

**- బాదావత్ కంసల్య, రైతు, దేవునిగుట్ట తండా**